క్లుప్తంగా

బ్రాండిక్స్‌లో 390 మందికి కంటి పరీక్షలు


కంటి పరీక్షలు చేస్తున్న ఆప్తాలమిస్టు

అచ్యుతాపురం: అధిస్తాన్(బ్రాండిక్స్) అపెరల్ సిటీలో ఆదివారం 135వ ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. అధిస్తాన్ తన సామాజిక ఆరోగ్య సంరక్షణలో భాగంగా నిర్వహించిన ఈ శిబిరానికి చుట్టు పక్కల గ్రామాల నుంచి విచ్చేసిన 390 మందికి ఆప్తాలమిస్టు కంటి పరీక్షలు చేశారు. 295 మందికి కళ్లద్దాలను అందజేశారు. మరో 156 మందికి మందులు పంపిణీ చేశారు. శిబిరానికి విచ్చేసిన వారిలో సమస్య అధికంగా ఉన్న కొంతమందికి కాటరాక్ట్ సర్జరీ చేయించుకోవాలని సూచించారు. రోగులకు మజ్జిగ, ఫలహారం, భోజనం సమకూర్చారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

అచ్యుతాపురం: మండలంలోని వెదురువాడ ఫీడర్ పరిధిలో సోమవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఈఈ(ఆపరేషన్స్) కే రాజశేఖర్ తెలిపారు. సదరు ఫీడర్ పరిధిలో మరమ్మత్తు పనుల వల్ల ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ సరఫరా నిలివేస్తున్నందున వినియోగదారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. దిబ్బపాలెం, ఆర్అంర్ఆర్ కాలనీ, గొర్లె ధర్మవరం, లంక ధర్మవరం, వెదురువాడ, వైఎస్ఆర్ నగర్, సాయి ప్రియ లే అవుట్, బర్మా కాలనీ, మార్టూరు రోడ్డు, మరిడిమాంబ కాలనీల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

వమ్మవరంలో ఊంజల్ సేవ


ఊంజల్ సేవలో పాల్గొన్న భక్తులు

ఎస్.రాయవరం: వమ్మవరంలోని స్వయంభూ వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న కల్యాణ మహోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఇందులో భాగంగా స్వామివారికి ఆలయంలో ఊంజల్ సేవ నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. కార్యక్రమంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

18 మంది దంపతులకు సత్కారం


దంపతులకు సత్కారం చేస్తున్న సభ్యులు

మునగపాక: మండలంలోని వాడ్రాపల్లిలో శనివారం రాత్రి 18 మంది దంపతులకు ఘన సత్కారం నిర్వహించారు. భీష్మ ఏకాదశిలో భాగంగా వాడ్రాపల్లి పెద రామాలయం వద్ద వెంకటేశ్వర గీతా ప్రచార సమితి కన్వీనర్ శరగడం పరదేశినాయుడు సారధ్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ హిందూ ధర్మ పరిరక్షణకు పాటుపడాలన్నారు. వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రుల పట్ల ప్రేమానురాగాలు చూపించాలన్నారు. పెద్దలను గౌరవించడం అలవాటు చేసుకోవాలన్నారు. సర్పంచ్ నూకరాజు, పెద్దలు పెతకంశెట్టి రామజోగినాయుడు, బొడ్డేడ సత్యనారాయణ, మళ్ల వరహా నరసింగరావు, కొణతాల శివరామకృష్ణ, మళ్ల శేషు, నాగరాజు, రామారావు, అప్పలనాయుడు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

గాయపడ్డ మిత్రుడికి ఆర్థిక సాయం


ఆనందం కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందిస్తున్న పూర్వ విద్యార్థులు

సబ్బవరం: తమతో కలిసి చదువుకున్న వ్యక్తి రోడ్డు ప్రమాదంలో గాయపడటంతో పూర్వ విద్యార్థులు ఆదివారం పరామర్శించి, ఆర్థిక సాయం అందించి, తమ మైత్రిని చాటుకున్నారు. మండలంలోని అంతకాపల్లి గ్రామానికి చెందిన శ్రీకాకుళపు ఆనందం ఇటీవల ద్విచక్రవాహనంపై వెళ్తూరోడ్డు ప్రమాదానికి గురై, తీవ్రంగా గాయపడ్డాడు. కాలు విరగడంతో మంచానికే పరిమితమయ్యాడు. విషయం తెలుసుకున్న తన టెన్త్ బ్యాచ్(2005–06) విద్యార్థులు ఆనందం ఇంటికి వెళ్లి పరామర్శించారు. రూ.30 వేలు ఆర్థిక సాయం అందించారు. తనకు అండగా నిలిచిన మిత్రులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

అందాల తీరం.... అభివృద్ధికి దూరం

సువిశాలమైన తీరంలో ఎగసి పడుతున్న అలలు.. కనుచూపు మేర కనిపించే ఇసుక తిన్నెలు, ఒడ్డున నల్లటి రాళ్లు, వాటి మధ్య సందర్శకులు స్నానమాచరిస్తూ సెల్ఫీలు దిగుతూ సరదాగా గడిపేందుకు అనువైన పర్యాటక ప్రదేశంగా రాంబిల్లి మండలం వాడపాలెం తీరం ప్రసిద్ధి... ఇక్కడ తీరం వెంబడి పచ్చని చెట్లు.. ప్రకృతి ప్రసాదించిన ఆహ్లాదకరమైన వాతావరణం పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటాయి. జిల్లాలో అతి పెద్ద తీరమైన పూడిమడకలో అపరిశుభ్రత కారణంగా ఎక్కువగా వాడపాలెం వస్తుంటారు. ఇక్కడ వారికి సరైన వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారు.


వాడపాలెం తీరం వద్ద శివపార్వతుల స్థూపం

- వాడపాలెం తీరంలో వసతులు కరవు
- పర్యాటకులకు తప్పని ఇబ్బందులు
- పట్టించుకోని పాలకులు, పర్యాటక శాఖ అధికారులు
- మాఘ పౌర్ణమికి అధిక సంఖ్యలో తరలి రానున్న భక్తులు


ఆహ్లాదకరమైన వాతావరణంలో కొబ్బరి తోటలు


వాడపాలెం సముద్రతీర ప్రాంతం




రాంబిల్లి (యలమంచిలి): జిల్లాలో అన్ని సముద్ర తీర ప్రాంతాలు కన్నా వాడపాలెం తీరం అత్యంత సుందరంగా పరిశుభ్రంగా ఉంటోంది. ఏటా మాఘ పౌర్ణమి, మహా శివరాత్రి, కార్తీక మాసాల్లో వాడపాలెం సముద్ర తీరానికి అధిక శాతం భక్తులు, పర్యాటకులు తరలి వస్తుంటారు. ఇక్కడ సముద్ర అలల తాకిడికి ఎటువంటి ప్రమాదం వాటిల్లకుండా రక్షణగా నిలిచే నల్లటి బండరాళ్ల మధ్య సందర్శకులు స్నానాలు చేసి అలల సవ్వడిని ఆస్వాదిస్తారు. తీరం ఒడ్డున గంగమ్మతల్లిని భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటారు. ప్రతి కార్తీక మాసంలో ఇక్కడ తీరం వెంబడి కొబ్బరి, సరుగుడు తోటలు పర్యాటకులకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పిస్తాయి. దాంతో పిక్నిక్ స్పాట్‌కు అనువైన ప్రాంతంగా మారింది.

తీరం అభివృద్ధిపై నీలినీడలు...

రాంబిల్లి మండలంలో వాడపాలెం తీరం పర్యాటకంగా ప్రాచుర్యం పొందినా అభివృద్ధి మాత్రం జరగడం లేదు. ప్రభుత్వాలు, పాలకులు మారినా తీరం అభివృద్ధిపై దృష్టి సారించడం లేదు. పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన రాంబిల్లి మండలంలో వందలాది పరిశ్రమలు ఏర్పడ్డాయి. నేవల్ బేస్ ప్రాజెక్ట్ ఏర్పాటవుతోంది. ఈ దృష్ట్యా అటు కొత్తపట్నం, వాడ నర్సాపురం సమీపంలో నేవల్ బేస్ డ్రెడ్జింగ్ పనులు వల్ల సముద్రతీర ప్రాంతాలకు పర్యాటకులు వెళ్లడానికి నిషేధాజ్ఞలు ఉన్నాయి. దాంతో వాడపాలెం తీరానికి సందర్శకులు ఎక్కువగా రావడానికి ఆసక్తి చూపుతున్నారు.

వసతులు కల్పించాలి


వాడపాలెం తీరం వద్ద సందర్శకులకు మరుగుదొడ్లు, సముద్రం ఒడ్డున కూర్చోవడానికి బల్లలు, విడిది చేయడానికి సినిమా షూటింగ్‌లు, పిక్నిక్‌లకు వచ్చే పర్యాటకులు సేద తీరడానికి కాటేజీలు, తాగునీరు, కిరాణా షాపులు వంటి సౌకర్యాలు కల్పించాలి.


సముద్రం ఒడ్డున రాళ్ల మధ్య సందర్శకులు స్నానమాచరించడానికి అనువైన ప్రదేశం

అజాగ్రత్త వహిస్తే ప్రమాదాలు తప్పవు

వాడపాలెం తీరంలో అజాగ్రత్త వహిస్తే ప్రాణాలకే ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది. తీరంలో బండరాళ్లు దాటి ముందుకు వెళితే అలల ఉధృతికి కొట్టుకుపోయే అవకాశాలు ఎక్కువగా ఉంటున్నాయి. ఇక్కడ పోలీసులు నిషేధిత హెచ్చరిక బోర్డులు పెట్టారు. ఈ ప్రాంతంలో ఎవ్వరూ స్నానాలు చేయరాదు. స్థానికంగా మత్స్యకారులు అందుబాటులో ఉండటం అంతంత మాత్రమే కావడంతో రక్షణపరమైన జాగ్రత్త చర్యలు తీసుకోవాలి.

అభివృద్ధి చేయాలి



పర్యాటకంగా ప్రాచుర్యం పొందిన వాడపాలెం తీరంలో అధునాతన వసతులు కల్పించాలి. తీరం పరిశుభ్రంగా ఉండటంతో మాఘపౌర్ణమి జాతర సందర్భంలో ఎక్కువగా ఇక్కడకు వస్తుంటారు.
– జి.దేముడునాయుడు జిల్లా సీఐటీయూ ఉపాధ్యక్షుడు

వసతులు లేక ఇబ్బందులు



మాఘపౌర్ణమి పర్వదినం సమయంలో భక్తులు ఎక్కువగా వాడపాలెం తీరాన్ని ఎంచుకుంటారు. ఏటా ఇక్కడకే స్నానాలకు వస్తాం. వేసవిలో సేద తీరేందుకు స్నేహితులతో కలసి సరదాగా గడుపుతుంటాం. కాకపోతే సందర్శకులకు ఏవిధమైన వసతులు లేకపోవడం వల్ల కొంత ఇబ్బందులకు గురవుతున్నారు.
– సారిపిల్లి పైడిరాజు, సందర్శకుడు

మాఘపౌర్ణమి స్నానాలకు అనువైన ప్రాంతం



వాడపాలెం తీరం సుందరమైనది. అన్ని తీరాలు కన్నా పరిశుభ్రంగా ఉంటోంది. ఆహ్లాదకరమైన వాతావరణం, సహజ సిద్ధమైన ఇసుక తిన్నెలతో చాలా బాగుటుంది. విశాఖ బీచ్ మాదిరిగా ఇక్కడ అభివృద్ధి చేయాలి. మాఘపౌర్ణమి స్నానాలకు అనువైన ప్రాంతం.
– దోని కాసియ్యా, కొత్తపట్నం

దళితుల అభ్యున్నతికి పాటుపడాలి


మునగపాకలో నినదిస్తున్న దళితులు

మునగపాక: దళితుల అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ పాటుపడాలని అంబేద్కరిజమ్ పునాది అసోసియేషన్ కన్వీనర్ రాజాన బుజ్జిబాబు పిలుపునిచ్చారు. స్థానిక బీసీ కాలనీలోని పూర్వ సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహంలో ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ దళితుల హక్కులపై అవగాహన పెంచుకోవాలన్నారు. ప్రతీ దళితవాడలో అంబేడ్కర్ పేరిట గ్రంథాలయాలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా విద్యార్థులు విజ్ఞానాన్ని పెంచుకునే అవకాశం ఉంటుందన్నారు. అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా నడుచుకోవాలన్నారు. సంస్థ ఉపాధ్యక్షులు గుంట్ల అప్పారావు మాట్లాడుతూ మండల స్థాయిలో అంబేద్కర్ సామాజిక భవనం ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సంఘాన్ని మరింత బలోపేతం చేయాలన్నారు. పిట్టా అప్పారావు, లంబా అప్పారావు, మూర్తి విష్ణు సూర్య అప్పారావు, పిల్లి అప్పారావు, బీలా శివగణేష్, లంబా అర్జునరావు, తట్టా అశోక్‌కుమార్, బైపా శేషు కుమార్, గెంజి రమణబాబు, కారు శాంతకుమార్, మార్లపల్లి గణపతి అప్పారావు తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో సూర్యనారాయణమూర్తి నోములు


మునగపాకలో సూర్యనారాయణ మూర్తికి పూజలు చేస్తున్న భక్తులు


మూలపేటలో గోనలతో భక్తులు

మునగపాక: మండల వ్యాప్తంగా సూర్యనారాయణ మూర్తి పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆదివారం ఉదయం నుంచి ఇళ్ల వద్ద పూజలు చేశారు. ప్రసాదం తయారు చేసి అందరికీ పంచిపెట్టారు. ఆరుబయట రుబ్బురోలుకు పూజలు చేసి, పలు రకాల సామగ్రిని జారుగా విడిచి నోములు నిర్వహించారు. ఇలా విడిచిన జారును పట్టుకోవడం ద్వారా దేవుని అనుగ్రహం తమపై ఉంటుందని భక్తుల నమ్మకం.

అపూర్వ సమ్మేళనం

- నాలుగుదశాబ్దాల తర్వాత
- పూర్వ విద్యార్థుల కలయిక
- గుంటపల్లి జడ్పీ పాఠశాల వేదిక


గుంటపల్లిలో సమావేశమైన పూర్వ విద్యార్థులు

నక్కపల్లి/పాయకరావుపేట : ఆరో తరగతిలో చిగురించిన స్నేహం నాలుగు దశాబ్దాలు గడిచినా పదిలంగా ఉంది. ఈ బాల్యస్నేహితుల కలయికకు గుంటపల్లి జెడ్పీ ఉన్నతపాఠశాల వేదికైంది. పాయకరావుపేట మండలం గుంటపల్లి జడ్పి ఉన్నత పాఠశాలలో ఆరోతరగతినుంచి పదోతరగతి వరకు కలసి చదువుకున్న పూర్వ విద్యార్థులు(టెన్త్1987బ్యాచ్) ఆదివారం ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసుకున్నారు.వీరంత ఒక చోట చేరి తమ చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. తమతో చదివి వివిధ కారణాలతో చనిపోయిన తోటి స్నేహితులు, తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులతో తమ అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. చదువుకున్న రోజుల్లో చేసిన అల్లరి చేష్టలను గుర్తు చేసుకుంటూ సందడి చేశారు. ఈ స్నేహం ఇలాగే కొనసాగాలని ప్రతి ఏటా పూర్వ స్నేహితులంతా ఒక చోట కలసుకోవాలని నిర్ణయించుకున్నారు. అప్పట్లో తమకు విద్యనేర్పిన గురువుల్లో ప్రసాదరావు, రామనాగులను ఈ సమ్మేళనానికి ఆహ్వానించి వారిని దుశ్శాలువ, బొకేలు, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. సుమారు నలభై ఏళ్ల తర్వాత కలుసుకునేలా చేసిన పూర్వ విద్యార్థులు లింగంపల్లి చిన్నారావు, పి రాజారావు, నాగభూషణం, శివవర్మ, రమేష్‌లకు తోటి విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరయిన జీసీఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు గెద్దం బుజ్జి మాట్లాడుతూ గుంటపల్లి పాఠశాలలో సుమారు నలభై ఏళ్ల క్రితం చదివిన విద్యార్థులు ఒక చోట చేరి స్నేహబంధాన్ని కొనసాగించే ప్రయత్నం చేయడం అభినందనీయమన్నారు. మీ స్నేహం ఇలాగే కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమానికి అనుకోకుండా వచ్చిన జబర్దస్త్ కమెడియన్ సత్తిపండు మాట్లాడుతూ కులమతాలకు, ధనిక పేద వర్గాలకు అతీతమయినది స్నేహమన్నారు. వ్యక్తిగత పనిపై గుంటపల్లి వచ్చిన తనకు పూర్వ విద్యార్థుల సమ్మేళనం చూసి చాలా ఆనందం అనిపించిందన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ మాజీ డైరక్టర్ గెద్దం కన్నబాబు, ఎంపీటీసీ సభ్యుడు తోట లచ్చబాబు, పూర్వ విద్యార్థులు ఎ. రామకృష్ణ, యాదాల దయానంద్, కర్రి రమేష్, వరహాలు, టి.శ్రీనివాస్, దండుశివ, బాల చంద్రమౌళి, సుందరలత, జానకీదేవి, కుంచా విజయలక్ష్మి, సత్యవతి, అన్నపూర్ణ, పల్యేల శ్రీధర్, త్రిమూర్తులు పాల్గొన్నారు.

5 వార్డులకు నీటి సరఫరా నిలిపివేత నేడు

యలమంచిలి రూరల్: మండలంలోని సోముదేవపల్లి వద్ద విద్యుత్ సరఫరాకు అంతరాయం కారణంగా పట్టణంలోని ఐదు వార్డులకు సోమవారం నీటి సరఫరా ఉండబోదని యలమంచిలి మున్సిపల్ కమిషనర్ బీజేఎస్ ప్రసాదరాజు ఆదివారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలో 11, 15, 16, 17, 18 వార్డులకు నీటి సరఫరా ఉండదన్నారు. ఎర్రవరం, నెహ్రూనగర్, ఏఎస్ఆర్ కాలనీ, రాంనగర్ ప్రాంతాల ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని కోరారు. ఆయా ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా ఉంటుందని గమనించాలన్నారు.

వెలుగు వీవోఏ ఉషకు సత్కారం


ఉషను సత్కరిస్తున్న వెలుగు వీవోఏ ఉద్యోగుల సంఘం నాయకులు

అనకాపల్లి: ఏపీ వెలుగు వీవోఏ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో మునగపాక మండలం టి. సిరసపల్లికి చెందిన వెలుగు వీవోఏ పొలమరశెట్టి ఉషను ఘనంగా సత్కరించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు సిహెచ్ రూపాదేవి మాట్లాడుతూ సేంద్రియ వ్యవసాయంలో ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేసినందుకు గానూ గణతంత్ర దినోత్సవంలో ఆమె అవార్డు అందుకోవడం అభినందనీయమన్నారు. వీవోఏలు అంకిత భావానికి ఈ అవార్డు నిదర్శనమని ప్రశంసించారు. కార్యక్రమంలో జిల్లా సంఘం గౌరవాధ్యక్షుడు వి.వి. శ్రీనివాసరావు, అధ్యక్షుడు కె.సూరిబాబు, కోశాధికారి కె. లక్ష్మీ ప్రసన్న, వై.లక్ష్మి, వెంకటలక్ష్మి, త్రినాథ్ పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

అనకాపల్లి: అఖిల భారత పోస్టల్, ఆర్ఎంఎస్ పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని ఏపీఆర్పీఏ కేంద్ర సంఘ కార్యవర్గ సభ్యులు పి. బాబూజీ, కాకినాడ డిజిజనల్ కార్యదర్శి తురగా సూర్యారావు, సిహెచ్ వెంకటేశ్వరావు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఏపీఆర్పీఏ అనకాపల్లి డివిజన్ పదో వార్షిక సమావేశం రాష్ట్ర సంఘం ఉపాధ్యక్షుడు సిహెచ్ సూర్యనారాయణ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాత పెన్షన్ పద్ధతి తిరిగి అమలు చేయాలని, కరోనా సమయంలో నిలుపుదల చేసిన 18 నెలల డీఆర్ బకాయిలు తక్షణమే చెల్లించాలని, కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య సర్వీస్ సౌకర్యాలు మెరుగుపరచాలని, ఎన్వీస్ పెన్షనర్లకు సీజీహెచ్ఎస్, ఫిక్స్డ్ మెడికల్ అలవెన్స్ అమలు చేయాలని, ఏడాది సర్వీస్ పూర్తి చేసి 2006 సంవత్సరం తర్వాత జూన్, డిసెంబర్లో రిటైరైన వారికి నోషనల్ ఇంక్రిమెంట్ మంజూరు చేయాలని కోరారు. ఈ సందర్భంగా పలువురు సభ్యులను సత్కరించారు. కార్యక్రమంలో డివిజనల్ సంఘం కోశాధికారి టి. కోటేశ్వరావు, అధిక సంఖ్యలో సభ్యులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక


వాడ్రాపల్లి ఆవ ప్రాంతంలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

మునగపాక: పూర్వ విద్యార్థులతో వాడ్రాపల్లి ఆవ ప్రాంతం ఆదివారం కళకళలాడింది. మునగపాక జెడ్పీ హైస్కూల్‌లో 1986–87లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులంతా వాడ్రాపల్లి ఆవ దరి ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఒకరి కొకరు పలుకరించుకొని ఉత్సాహంగా గడిపారు. నాటి తీపి జ్ఞాపకాలను ఒక్కసారిగా మననం చేసుకొని సంతోషపర్వం చెందారు. ఇతర ప్రాంతాల్లో స్థిరపడిన వారంతా ఈ సమావేశానికి హాజరయ్యారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆటపాటలతో సందడి చేసి మధ్యాహ్నం అంతా సహపంక్తి భోజనాలు చేశారు. అనంతరం ఆవలో బోటు షికారు చేసి మంత్ర ముగ్ధులయ్యారు. సమావేశంలో పూర్వ విద్యార్థులు పెంటకోట గిరిబాబు, కాండ్రేగుల జగదీష్, వెలగా సురేష్‌కుమార్, ఏపీఎన్ మూర్తి, బీఎం నాయుడు, కాండ్రేగుల వెంకటప్పారావు, అనసూయ, దాడి రమణబాబు తదితరులు పాల్గొన్నారు.

వాడ్రాపల్లిలో..


వాడ్రాపల్లి ఆవలో ఇంటర్ పూర్వ విద్యార్థినులు

మునగపాక: అనకాపల్లిలోని ఆదినారాయణ మహిళా కళాశాలలో చదువుకున్న ఇంటర్మీడియట్ పూర్వ విద్యార్థినులు ఆదివారం మండలంలోని వాడ్రాపల్లిలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. 1988–1990లో ఇంటర్ చదువుకున్న విద్యార్థినులు ఉదయం నుంచి సాయంత్రం వరకు ఇక్కడ ఆటపాటలతో సందడి చేశారు. మాజీ ఎంపీటీసీ, పూర్వ విద్యార్థిని సూరిశెట్టి సుధారాణి ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ కలయికకు రమణీలక్ష్మి తదితరులు హాజరయ్యారు. అదే కళాశాలలో ప్రస్తుతం లెక్చరర్లగా పనిచేస్తున్న నూకరత్నం, కనకదుర్గ శైలజ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రగతి ఉజ్వల భవిష్యత్తుకు నాంది


అభినందన సభలో విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి విజయ్ ప్రకాష్

పాయకరావుపేట: స్థానిక శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల్లో అభినందన కార్యక్రమం ఆదివారం వేడుకగా జరిగింది. విద్య, సాంస్కృతిక, క్విజ్, ఆటలు, యోగా, పోటీ పరీక్షలు వంటి అనేక అంశాల్లో జాతీయ, రాష్ట్ర, జిల్లా, పట్టణ స్థాయిలో ప్రతిభ కనబరిచిన, నూటికి నూరు శాతం హాజరు కనబరిచిన శ్రీ ప్రకాష్ విద్యార్థులకు విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి విజయ్ ప్రకాష్ బహుమతులు ప్రదానం చేశారు. ప్రతిభ కనబరిచిన 1,050 మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తలుచుకుంటే సాధించలేనిది ఏమి లేదన్నారు. వారి సాధించిన ప్రగతి వారి ఉజ్వల భవిష్యత్తుకు నాంది అవుతుందన్నారు. విద్యార్థుల అభిరుచికి తగిన రంగంలో శిక్షణ ఇవ్వడం ద్వారా విజయం సాధిస్తున్నారన్నారు. వారిలో ప్రతిభను వెలికి తీయడమే కాక వారి భావి జీవితాలను ఉన్నత స్థానానికి తీసుకెళ్లడానికి దోహదపడుతున్నామని అన్నారు. విజేతలకు స్ఫూర్తి పెంపొందించడం కోసం వారికి జ్ఞాపికలు కాకుండా పుస్తకాలు ఇస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల వివిధ విభాగాలకు చెందిన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.